క్లుప్తంగా

నేడు గండేపల్లిలో గడపగడపకూ..

గండేపల్లి: మండలంలోని గండేపల్లిలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీపీ చలగళ్ల దొరబాబు తెలిపారు. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అర్చకుడు గోపాల్‌కు సత్కారం



అర్చకుడు గోపాల్‌ను సన్మానిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

ఏలేశ్వరం: మండలంలోని లింగంపర్తి గ్రామానికి చెందిన అర్చకుడు వీఎస్‌ఆర్ గోపాల్‌ను ఆదివారం దేవదాయ, ధర్మదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ సన్మానించారు. గోపాల్ తొమ్మిది పీజీలు చేశాడు. దీంతో తాడేపల్లిగూడెంలో జరిగిన అర్చక ఆగమ శిక్షణ తరగతులు, అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి కొట్టు సత్యనారాయణ గోపాల్‌ను పూలమాల, శాలువాతో సత్కరించారు. గోపాల్ అర్చక వృత్తిలో ఉంటూ తొమ్మిది పీజీలు చేయడం అభినందనీయమన్నారు. ఐదు జిల్లాలకు చెందిన సుమారు వెయ్యిమంది అర్చకులు శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు.

చక్రపాణికి చిత్రకళారత్న అవార్డు



చక్రపాణికి అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

ఏలేశ్వరం: పట్టణానికి చెందిన చిత్రకారుడు తూమురొౌతు చక్రపాణి భారత చిత్రకళారత్న అవార్డుకు ఎంపికయ్యాడు. కోనసీమ జిల్లా అమలాపురంలో ఆదివారం జరిగిన 31వ అంతర్జాతీయ కోనసీమ చిత్రకళాపరిషత్ పోటీల్లో చక్రపాణి గీసిన బ్రహ్మోత్సవం చిత్రానికి గాను అవార్డు లభించింది. ఈ మేరకు రాష్ట్ర సాంస్కృతిక మండలి రాష్ట్ర అధ్యక్షురాలు కుడుపూడి సత్యశైలజ భారతి, మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, సంస్థ అధ్యక్షుడు మెట్ల రమణబాబు చేతులమీదుగా చక్రపాణికి అవార్డు అందజేశారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

తపోవనంలో మహా సౌరోపాసన



తపోవనంలో మహాసౌరోపాసన చేస్తున్న వేద పండితుడు

తుని రూరల్: మండలంలోని కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో మాఘమాసం సందర్భంగా ఆదివారం వేద పండితులు మహా సౌరోపాసన చేశారు. పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో పండితులు మాఘ మాస భానువార పరస్పర అరుణోపాసన (సౌరోపాసన) నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు మాఘమాసం విశిష్టత, సూర్య నమస్కారాలతో కలిగే ప్రయోజనాలను ఉపదేశించారు. రథసప్తమి పర్వదినంలో ఆచరించాల్సిన నియమాలను వివరించారు. వేద పండితులు, వేద విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

నరసింహయ్య మృతి తీరని లోటు



జగ్గంపేటలో నరసింహయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రైతుకూలీ సంఘం నేతలు

జగ్గంపేట: సీపీఐ (ఎంఎల్) జనశక్తి రాష్ట్ర కార్యదర్శి నంబి నరసింహయ్య మృతి విప్లవోద్యమానికి తీరని లోటు అని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. జగ్గంపేట యూటీఎఫ్ భవనంలో ఆదివారం నరసింహయ్య సంతాప సభ నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విప్లవోద్యమంలో ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు కొండా దుర్గారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, ఎఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఆర్.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పత్రాలు.. ఇక ఆన్‌లైన్‌లో భద్రం



ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పాత డాక్యుమెంట్లను డిజిటలైజేషన్ చేస్తున్న సిబ్బంది

- పూర్వపు దస్తావేజులకు కొత్తరూపు
- పాత డాక్యుమెంట్ల కంప్యూటరీకరణ
- కొత్త విధానంతో తీరనున్న కష్టాలు

ప్రత్తిపాడు: స్టాంపులు–రిజిస్ట్రేషన్ శాఖ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో బీరువాలు, పెట్టెలు, బ్యాంకు లాకర్లలో ఏళ్లతరబడి దాచుకున్న, చెదలు పట్టే దశలో ఉన్న ఆస్తి కాగితాలకు కాలం చెల్లుతోంది. ఇటువంటి దస్తావేజు(ఆస్తి కాగితా)లు ఇకపై ఆన్‌లైన్‌లో భద్రంగా ఉంటాయి. ఎప్పుడైనా డాక్యుమెంట్లు (దస్తావేజులు) కావాలంటే ఒకే ఒక్క క్లిక్‌తో మన చేతిలో ఉంటాయి. ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలో పూర్వం నుంచి 2000 సంవత్సరం వరకూ ఉన్న రిజిస్ట్రేషన్లకు సంబంధించిన డాక్యుమెంట్లను స్టాంపులు–రిజిస్ట్రేషన్ శాఖ డిజిటలైజేషన్‌కు శ్రీకారం చుట్టింది. ఈ ప్రక్రియ పూర్తయితే ఆన్‌లైన్ ఆధారిత సేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయి.

ఐడీఎంఆర్ఎస్ విధానంలో...

స్టాంపులు–రిజిస్ట్రేషన్ శాఖలో 2000వ సంవత్సరం నుంచే కంప్యూటరీకణ ప్రారంభమైంది. అప్పటి నుంచే ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. అంతకు ముందు జరిగిన ఆస్తుల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్ల వివరాలను పెద్ద పుస్తకంలో చేతితో రాసి భద్రపరచేవారు. 2000కు పూర్వం వందేళ్లకు పైగా జరిగిన రిజిస్ట్రేషన్ల వివరాలన్నీ పెద్ద పెద్ద పుస్తకాల రూపంలో గుట్టలు గుట్టలుగా ఉన్నాయి. ఈ పెద్ద పుస్తకాల్లో ఏదైనా ఒక కాగితం చిరిగిపోయినా, చెదలు పట్టి పాడైనా, తడిసి అక్షరాలు కలిసిపోవడం, చెరిగిపోవడం జరిగితే అందులో ఉన్న ఆస్తుల వివరాలను ధ్రువీకరించేందుకు ఎన్నో ఇబ్బందులు పడేవారు. వీటిలో కక్షిదారులు కోరిన సమాచారాన్ని రాసి ఇవ్వాలన్నా వెతికి గుర్తించడమే కష్టమవుతోందని సిబ్బంది చెబుతున్నారు. ఈ ఇబ్బందులకు చెక్ పెడుతూ ఇంటిగ్రేటెడ్ డాక్యుమెంట్ మేనేజ్‌మెంట్ రికార్డ్ సిస్టమ్(ఐడీఎంఆర్ఎస్) విధానంలో పాత డాక్యుమెంట్లన్నీ డిజిటలైజేషన్ చేస్తున్నారు. పాత రికార్డులను స్కానింగ్ చేసి ఆన్‌లైన్‌లో భద్రపరుస్తున్నారు.

చురుగ్గా డిజిటిలైజేషన్

ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పాత రికార్డుల కంప్యూటరీకరణ చురుగ్గా సాగుతోంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో ప్రత్తిపాడు మండలంలోని 44 గ్రామాలు, ఏలేశ్వరం మండలంలోని 11 గ్రామాలు, ఏలేశ్వరం నగర పాలక సంస్థ, శంఖవరం మండలంలోని కత్తిపూడి, రామన్నపాలెం, వజ్రకూటం, ఓండ్రేగుల, ఎరకాపురం, పితాపురం మండలంలోని వెల్దుర్తి, పి దొంతమూరు, కిర్లంపూడి మండలంలోని కిర్లంపూడి, జగపతినగరం, సింహాద్రిపురం, రామకృష్ణాపురం, రాజుపాలెం, చిల్లంగి, గెద్దనాపల్లి, ముక్కొల్లు, వేలంక, గొల్లప్రోలు మండలంలోని చెందుర్తి, చిన జగ్గంపేట, కొడవలి, వన్నెపూడి వెరసి 76 గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లోని ఆస్తుల క్రయ విక్రయాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు ఇక్కడే జరుగుతాయి. ఈ కార్యాలయంలో వందేళ్ల క్రితం నుంచి 2000వ సంవత్సరం వరకూ 1862 వాల్యూమ్‌లున్నాయి. వీటిని కంప్యూటరీకరణ చేసే పని చురుగ్గా సాగుతోంది.

ఒక్క క్షణంలోనే డాక్యుమెంట్



భూములకు సంబంధించిన డాక్యుమెంట్లు పూర్వపు రోజుల్లో కాగితాల్లో ఉండేవి. వీటిని భద్రపరచడం కష్టంగా ఉండేది. సర్వేలు, డాక్యుమెంట్లన్నింటినీ డిజిటైజేషన్ చేస్తున్నాం. ఇప్పటికే 50 శాతం పూర్తియ్యింది. ఈ ప్రక్రియ పూర్తయితే రిజిస్ట్రేషన్ వివరాలు, డాక్యుమెంట్లను క్షణాల్లో అందిస్తాం.

– టి.సుబ్బారెడ్డి, సబ్ రిజిస్ట్రార్, ప్రత్తిపాడు

ప్రశాంతంగా కానిస్టేబుల్ రాత పరీక్షలు

- పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు
- ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపిన ఆర్టీసీ

గండేపల్లి: మండలంలోని ఆదిత్య, ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలల్లో ఆదివారం కానిస్టేబుల్ రాత పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకూ పరీక్షలు నిర్వహించారు. ఆదిత్య క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన 12 పరీక్ష కేంద్రాల్లో 10,000 మంది అభ్యర్థులకు గాను 9006 మంది పరీక్షలకు హాజరుకాగా, ప్రగతి క్యాంపస్‌లో 1500 మంది అభ్యర్థులకు గాను 1364 మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షలకు హాజరైన అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. ఈ పరీక్ష కేంద్రాలను కాకినాడ జిల్లా ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు పరిశీలించారు. కళాశాలల యాజమాన్యానికి, పోలీస్ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎటువంటి అసాంఘిక సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసినట్టు ఎస్పీ తెలిపారు. అభ్యర్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపింది. అడిషనల్ ఎస్పీ సత్యనారాయణ, పెద్దాపురం ఇన్‌చార్జ్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో జగ్గంపేట సీఐ బి.సూర్య అప్పారావు, గండేపల్లి ఎస్సై వై గణేష్ కుమార్‌తో పాటు 120 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

26న సామూహిక అక్షరాభ్యాసం

తుని: వసంత పంచమి సందర్భంగా స్థానిక బ్యాంకు కాలనీలోని సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో ఈ నెల 26న సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తున్నట్టు పాఠశాల హెచ్ఎం ఇసరపు స్వామి ఆదివారం తెలిపారు. జేసీఐ జ్యూయలర్స్ సహకారంతో నిర్వహించే ఈ కార్యక్రమంలో పాల్గొనే చిన్నారులకు ఉచితంగా పలక, బలపం, పూజా సామగ్రి అందిస్తామన్నారు. అక్షరాభ్యాసం చేయించాలనుకునే వారు ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 86864 34374 నంబరును సంప్రదించాలని సూచించారు.

రత్నగిరిపై సూర్యనమస్కారాలు



రత్నగిరిపై సూర్యనమస్కారాలు నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో ఆదివారం సూర్యనమస్కారాలు నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు చేసి వివిధ భంగిమల్లో సూర్య నమస్కారాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. పండితులు ఆకొండి కృష్ణశర్మ, రాందాసు, నాగాబట్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం స్థలం ఆక్రమణకు ప్రయత్నం

- పోలీసులకు ఫిర్యాదు చేసిన రత్నగిరి ఈఓ



కళాశాల వెనుక గల స్థలంలో చెట్లు కొట్టేసిన దృశ్యం

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి చెందిన రూ.20 లక్షలు విలువ చేసే సుమారు రెండు సెంట్ల స్థలాన్ని ఆక్రమించేందుకు కొంతమంది విఫలయత్నం చేశారు. దీనిలో భాగంగా ఆ స్థలంలో ఉన్న చెట్లను పొక్లెయిన్‌తో కూల్చేశారు. విషయం దేవస్థానం అధికారుల దృష్టికి రావడంతో ఈఓ సత్యనారాయణ మూర్తి శనివారం సాయంత్రం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక శ్రీసత్యదేవ జూనియర్ కళాశాల వెనుక దేవస్థానానికి రెండు సెంట్లు స్థలం ఉంది. ఆ స్థలానికి ఆనుకుని దేవస్థానం విశ్రాంతి ఉద్యోగుల ఇళ్లు ఉన్నాయి. వీరు పంచాయతీ రోడ్డుకు రావాలంటే చుట్టూ తిరిగి రావల్సిన పరిస్థితి. అక్కడున్న దేవస్థానం స్థలంలో రోడ్డు నిర్మిస్తే వీరు సులభంగా పంచాయతీ రోడ్డును చేరుకునే వీలుంది. ఈ నేపథ్యంలో గత శుక్రవారం సాయంత్రం కళాశాల స్థలం వెనుక గల చెట్లను కొంతమంది పొక్లెయిన్‌తో కూల్చేశారు. విషయం రత్నగిరి ఈఓ దృష్టికి రావడంతో ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా పాదాలమ్మ ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో పాదాలమ్మవారు

రౌతులపూడి: మండలంలోని బలరామపురంలో వేంచేసిన పాదాలమ్మతల్లి, మరిడమ్మతల్లి అమ్మవార్ల ఆలయ ఏడో వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సప్తాహం ఏర్పాటు చేశారు. ములగపూడి, పీకే గూడెం, గిడజాం, కొత్త కొట్టం, పాల్తెరు, చెబ్రోలు గ్రామాల నుంచి వచ్చిన భజన బృందాల సభ్యులు భక్తి గీతాలతో అలరించారు. వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బీజేపీ బూత్ కమిటీల ఏర్పాటు



తిరుమాలిలో పార్టీలోకి చేరిన వారికి కండువాలు వేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్

ఏలేశ్వరం: బీజేపీతోనే దేశంలో అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ అన్నారు. మండలంలోని తిరుమాలిలో ఆదివారం బీజేపీ బూత్ కమిటీలను ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన ఎలుబండి సూరిబాబును పార్టీ మండల ఉపాధ్యక్షుడిగా, మర్రివీడుకు చెందిన కొప్పిశెట్టి సత్యనారాయణను మండల ప్రధాన కార్యదర్శిగా నియమించారు. అనంతరం పలువురు పార్టీలో చేరగా వారికి రామ్‌కుమార్ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామాల్లో ప్రజలకు వివరించాలన్నారు. ప్రధాని మోదీ హయాంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండి కొండలరావు, దాకే కృష్ణారావు, ఏనుగు ధర్మరాజు, కురాకుల రాజా, పతివాడ వెంకటేశ్వరరావు, ఈగల వెంకటేశ్వరరావు, గున్నాబత్తుల రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల ఆందోళన

జగ్గంపేట: గుర్రంపాలెం పంచాయతీలోని సగరపేటలో సేవ చేస్తున్న గుర్రాల డేనియల్ పట్ల అనుచితంగా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ క్రైస్తవులు ఆందోళన చేశారు. ఈ మేరకు యునైటెడ్ పాస్టర్ ఫెలోషిప్ ఆఫ్ జగ్గంపేట మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఏఎస్ఐ నూకరాజుకు ఫిర్యాదు చేశారు. తొలుత జగ్గంపేట మెయిన్ సెంటర్లో మానవహారంగా ఏర్పడి డేనియల్‌కు మద్దతుగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్ సుదర్శన్, విజయ రాజ్, ఫెలోషిప్ సెక్రటరీ చక్రవర్తి, మండల కో ఆప్షన్ సభ్యుడు కె.జాన్‌వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

సగరపేటకు చెందిన మరో వర్గం ఆందోళన

గుర్రంపాలెం సగరపేటకు చెందిన మరో వర్గం ఆదివారం రాత్రి జగ్గంపేట పోలీస్ స్టేషన్‌కు వద్ద ఆందోళన చేసింది. తమ కాలనీలో సౌండ్ పొల్యూషన్ పెరిగిపోయిందని, ప్రార్థనల పేరుతో పెద్ద శబ్దం వచ్చేలా మైకులు పెడుతున్నారని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు. సోమవారం రెండు వర్గాలతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని జగ్గంపేట సీఐ సూరి అప్పారావు ఇరువర్గాలకు సూచించడంతో ఆందోళన విరమించారు.

గొరంపేటలో పారిశుధ్య డ్రైవ్



గొరంపేటలో ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ కార్మికుడు

శంఖవరం: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని గొరంపేట సర్పంచ్ రామిశెట్టి ఏసుబాబు అన్నారు. మండలంలోని గొరంపేటలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు.

ఇంజినీర్స్ అసోసియేషన్ కో ఆర్డినేటర్‌గా శ్రీనివాస్



శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఇంజనీర్ అసోసియేషన్ ప్రతినిధులు

తుని: రాష్ట్ర ఇంజినీర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కో ఆర్డినేటర్‌గా తుని అసోసియేషన్ ఈఆర్ టీవీ శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఆదివారం గుంతకల్లులో జరిగిన రాష్ట్ర ఇంజినీర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఈసీ బాడీ మీటింగ్‌లో కమిటీ సభ్యులు శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కో ఆర్డినేటర్‌గా ఎన్నికైన శ్రీనివాస్‌ను అసోసియేషన్ ప్రతినిధులు సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షులు చేపూరు శ్రీనివాస్‌కుమార్, చైర్మన్ మురళీకృష్ణ, వర్కింగ్ సెక్రటరీ కమలాకర్ రెడ్డి, మాజీ చైర్మన్ శంకర్, రాష్ట్ర ఈసీ మెంబర్లు పాల్గొన్నారు.

సచివాలయాల కన్వీనర్‌గా రాజా



జగ్గంపేట: మండల సచివాలయాల కన్వీనర్‌గా జగ్గంపేట గ్రామ ఉపసర్పంచ్ బండారు రాజా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల ద్వారా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. తనకు ఈ పదవి వచ్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు మండల సమావేశం

తొండంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 24న మండల సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ పసపులేటి సతీష్ ఆదివారం తెలిపారు. ఎంపీపీ అంగుళూరి అరుణ్‌కుమార్ అధ్యక్షతన ఉదయం 10:30 గంటలకు జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

వైభవంగా నల్లగొండమ్మతల్లికి బోనాలు



ఎస్.అన్నవరంలో నల్లగొండమ్మతల్లి బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

- అమ్మవారిని దర్శించిన మంత్రి దాడిశెట్టి రాజా
- వందలాదిగా బోనాలు సమర్పణ



భక్తులతో కలసి నల్లగొండమ్మతల్లిని దర్శించుకుంటున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని రూరల్: ఎస్.అన్నవరం శివారు మెట్టవద్ద కొలువైన నల్లగొండమ్మతల్లి పండగను పురస్కరించుకుని ఆదివారం బోనాల ఊరేగింపు కన్నులపండువగా జరిగింది. వందలాది మంది మహిళలు శిరస్సుపై బోనాలు ధరించి ఎస్.అన్నవరం, కొత్తసూరవరం మీదగా ఆలయం వరకూ (పది కిలో మీటర్ల మేర) కోలాటం, తప్పెటగుళ్లతో ఊరేగింపు నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యూలైన్లలో వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు. అమ్మవారిని దర్శించి, పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద మహాన్నదానం నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు. డీసీసీబీ డైరెక్టర్ పోలిశెట్టి సోమరాజు, వైస్ ఎంపీపీ చొడిశెట్టి సత్య నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొయ్యా మురళీకృష్ణతో కలసి రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంత్రి దాడిశెట్టి రాజాను ఘనంగా సత్కరించారు. సాయంత్రం అమ్మవారి తీర్థం ఘనంగా జరిగింది. ఎస్.అన్నవరం, కొత్త సూరవరం, తుని, గెడ్లబీడు, జగన్నాథగిరి, ఎస్.చామవరం తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు దండెం రామకృష్ణ, సభ్యులు వంగలపూడి కనకబాబు, వంగలపూడి కాంతారావు, వంగలపూడి గోవిందుబాబు, వంగలపూడి బుజ్జి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



లంపకలోవ జెడ్పీ హైస్కూల్‌లో కలిసిన 1996-97 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని లంపకలోవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1996–97 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 26 ఏళ్ల తరువాత తాము విద్యను అభ్యసించిన పాఠశాలలో నే కలుసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొని పాఠశాల ఆవరణలో ఆటపాటలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు బండారు సత్యనారాయణ, బోడపాటి వసంతరావులను ఘనంగా సన్మానించారు. పలువురు పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

అలనాటి స్మృతులు పదిలం



కిర్లంపూడి పద్మనాభ ఫంక్షన్ హాల్‌లో కలిసిన పూర్వ విద్యార్థులు

కిర్లంపూడి: స్థానిక కొక్కొండ రామశేషగిరిరావు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1983–84 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. స్థానిక పద్మనాభ ఫంక్షన్ హాలులో కుటుంబ సమేతంగా కలుసుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తాము చదువుకున్న పాఠశాలకు వెళ్లి తరగతి గదుల్లో కలియ తిరిగారు. నాడు చేసిన అల్లర్లు, హాస్య సన్నివేశాలను నెమరు వేసుకొని కొంత సమయం చిన్నపిల్లలుగా మారిపోయారు. అనంతరం వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూలమాలలు, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఉండు గంగాధరరావు, చదలవాడ బాబీ, గౌతు జగన్నాథరావు, కొల్లా సూరిబాబు, ఆడారి శ్రీను, దాడి గోవిందు, గంటా గణేష్, చదరం శ్రీను, సేనాపతి బాబు సన్యాసిరావు, సంగిశెట్టి జానకి, సీహెచ్ సూర్య కుమారి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా ఏలేరు కాలువ రేవులు



ఏలేశ్వరంలో శిథిలావస్థకు చేరిన రేవు



వ్యర్థాలతో అధ్వానంగా ఉన్న ఏలేరుకాలువ

- జోరుగా ఇసుక అక్రమ తవ్వకాలు
- ఉపాధి కోల్పోతున్న రజకులు

ఏలేశ్వరం: గ్రామాల్లోని ఏలేరు కాలువ రేవులు అధ్వానంగా ఉడడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఏలేశ్వరం, తిరుమాలి, యర్రవరం గ్రామాల్లో సుమారు పది వరకూ రేవులు ఉన్నాయి. వీటిలో రజకులతో పాటు ఆయా గ్రామాల ప్రజలు దుస్తులు ఉతుకుతూ జీవనం సాగిస్తున్నారు. రేవులు శిథిలావస్థకు చేరడంతో కాలువలోకి దిగేందుకు వారు ఇబ్బందులు పడుతున్నారు. ఏలేరు ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిన నాటి నుంచి ఏలేరు కాలువలో నీటి సరాఫరా అంతంత మాత్రంగా ఉండడంతో రేవుల పరిస్థితి దారుణంగా మారింది. గతంలో రేవుల వద్ద పంచాయతీ నిధులతో సిమ్మెంట్ మెట్లు నిర్మించేవారు. ఇటీవల రేవుల్లోని మెట్లు శిథిలమైనా పట్టించుకునే నాథుడు కరువయ్యాడని రజకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేవులు శిథిలం కావడంతో ఉపాధి కోల్పోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రేవులతో పాటు కాలువను అభివృద్ధి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇసుక తరలింపుతో ఇక్కట్లు

ఏలేరు కాలువలోని రేవుల వద్ద ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. రజకులు ఉతికిన దుస్తులు ఆరబెట్టేందుకు రేవుల సమీపంలో ఇసుక దిబ్బలు ఉండేవి. ఇటీవల కాలంలో ఇసుకకు డిమాండ్ పెరగడంతో రేవుల వద్ద ఇసుకను రాత్రిపూట అక్రమంగా తరలిస్తున్నారు. దీంతో రజకులు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. ఇసుక తీసిన గోతులు ప్రమాదకరంగా ఉన్నాయని రజకులు ఆరోపిస్తున్నారు. గోతుల్లో పశువులు పడి మృత్యువాత పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకోవడంతో పాటు ఏలేరు కాలువను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టపగలే విద్యుత్ వెలుగులు



కృష్ణునిపాలెంలో పట్టపగలే వెలుగుతున్న విద్యుత్ లైట్లు

గోకవరం: మండలంలోని పలు గ్రామాల్లో పట్టపగలే వీధి లైట్లు వెలుగుతున్నాయి. కృష్ణునిపాలెం, గోకవరం, తంటికొండ, మల్లవరం తదితర గ్రామాల్లో పగలు, రాత్రి తేడా లేకుండా విద్యుత్ వీధిదీపాలు వెలుగుతున్నాయి. దీంతో విద్యుత్ దుర్వినియోగం కావడంతో పాటు లైట్లు త్వరితగతిన మరమ్మతులకు గురవుతున్నాయి. విద్యుత్ స్తంభాలకు మూడో లైన్ ఏర్పాటు చేయకపోవడంతో ఈ సమస్య తలెత్తుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మూడో విద్యుత్ లైన్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు 27న ఇంటర్వ్యూలు

తుని రూరల్: మండలంలోని వి.కొత్తూరు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల (అటానమస్)లో గెస్ట్ లెక్చరర్ల నియమకానికి ఈ నెల 27న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ (ఆర్గానిక్ కెమిస్ట్రీ), ఎంఎస్సీ (కంప్యూటర్ సైన్స్) కోర్సులకు గెస్ట్ లెక్చరర్లను నియమిస్తున్నట్టు తెలిపారు. ఎంఎస్సీలో ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఫిజికల్ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ ఉత్తీర్ణులైన ఆసక్తి గల అభ్యర్థులు బయోడెటా, ఒరిజినల్ సర్టిఫికేట్లతో ఆ రోజు ఉదయం పది గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 86390 94333 నంబరును సంప్రదించాలని సూచించారు.